


# చట్టంచాటు మనిషి

పెద్దకాపు మకాంలో కొబ్బరి చిక్కం వూగుతోంది. చిక్కంలో పెద్దకాపు భారీ కాయం వూగుతోంది. అతన్తోబాటు అమెరికానుంచి దిగిన అనపర్తి సరుకు సీసా వూగుతోంది. ఆయన తల వూగుతోంది. అవతల పడమటి గాలికి పచ్చటి కొబ్బరి మట్టలు వూగుతున్నాయి. వాటిల్లోంచి పైకి పాకుతోన్న చంద్రుడు వూగుతున్నాడు.

'భేష్! బలే బాగుంది. చెరువులో చంద్రుణ్ణి చేపపిల్ల వూగించినట్టూగుతోంది. బలే! ప్రపంచం అంతా మాంచి వూపులో వుందన్నమాట!' అనుకున్నాడు పెద్దకాపు. మళ్ళీ అనుకోటోతున్నాడు.

అంతలో —

'బాబో, పెద్దకాపుగారో, వొచ్చేశ్నా! మీ మాటే కాయమండయ్యా!' అన్న మాట వినబడింది.

అదిరిపడి లేచి కూర్చున్నాడు పెద్దకాపు. మత్తు అంతా దిగిపోయి నట్టుంది. మెదడుకు తేలిగ్గా, ఒంటికి హాయిగా వుంది. అంత భారీ కాయమూ దూది పింజలా తేలికై కింటికి దూకింది. దూకి ముందుకు పరుగెత్తింది.

'పానకాలూ! మనిషివంటే నువ్వురా!!'

ఇంచు మించు కౌగలించుకున్నంత పని చేశాడు పెద్దకాపు. మామూలప్పుడైతే మనిషిని అల్లంత దూరాన్న నిలబెట్టిగాని మాట్లాడడు. అంతెందుకు రెండు గంటల క్రితం అలాగే మాట్లాడాడు. కాని ఇప్పుడు, ఈ పరిస్థితివేరు. ఈ ఆనందంలో ఆవన్నీ మనసులోకి రావు.

రెండు గంటల క్రితం 'ఆ పని నేన్చెయ్యను' అని వెళ్ళిపోయాడు పానకాలు. అప్పట్నుంచి అతని మనసులో ఏదో మాయముడి లాంటిది బిగుసుకోసాగింది. ఇప్పుడా మాయ ముడి విడిపోయింది. తన ప్రాణాశకు ప్రతిబంధకం తొలగిపోయింది. అయినా అతనీ చర్య అతనికే కొత్తగా అనిపించింది.

'అరె! ఇంకా మత్తు వదల్లేదేంటి స్వా' అని ఆశ్చర్యపోయి అప్పుడే రెండడుగులు వెనక్కి వేశాడు కూడాను.

'మరెప్పు డంటారు?' అడిగాడు పానకాలు.

'అంత కంగారెందుకురా నూకాలూ! నువ్వొప్పుకున్నావు. బేరం వొప్పుకున్నాక ఎప్పుడో అప్పుడు పని జరక్కపోదు. పోనీ జరగలేదే అనుకో. నువ్వెక్కడికి పోతావ్? ఆఁ... అందుకని... ముందు నువు కాస్త చుక్కేసుకో.'

'ఉప్పుడెందుకులే బాబయ్యా! అసలే కూడుతిని నాలుగు రోజులయింది'.

'కూడు లేకుండ ఏసుకుంటేనేరా కిక్కు మాంచిగ కొడతాది. చూడు! నేనెంత తాగినా కిక్కు కొట్టదు. మరి మన పద్దిగాడు చూడు. పద్దిగాణ్నెరగవేంటిరా? మా పెద్దపాలేరు. నిన్ను తీసుకురాలా...అ...'

'పద్దాలు తెల్వకేంలే బాబయ్యా'

'మరాడు.... ఒక్కగుక్క ఏసుకుంటే చాలు. కొత్త గుర్రం ఎక్కినట్టు ఊకె ఊగిపోతాడు'

'అయినా ఇదేం మాఁవులు సరుకను కుంటన్నావేంటి? సీఁవ సరకు. తెల్లోడు తాగేది. నువెప్పుడు తాగుండవ్. కొంచెం రుచి చూడు మరి వొదుల్తావేమో!'

చిక్కంలోచి సీసా పానకాలు చేతిలో కెళ్ళింది. దాంట్లో మిగిలిన సరుకంతా అతని పొట్టలో కెళ్ళింది. కాళీ పొట్టేమో, దాని కైపంతా రవంత కూడ తగ్గకుండ తలకెక్కింది.

'కూడు లేదని నువ్వేం విచారించకురా పానకాలూ! పొద్దున్నే పద్దిగాడు ఓ బస్తా బియ్యం పడేస్తాళ్ళే'

'తూత్.... బీస్తల్లీ.., బియ్యఁవేం జేస్కుంటం దాఁవూ....' అన్నాడు వూగుతూ.

*   *   *

రోజులాగే ఆ వేళా తెల్లవారింది. కాని మామూలుగా మాత్రం కాదు. మళ్ళీ బ్రహ్మ రాక్షసికి బలైన మరో మనిషి మరణవార్తను ప్రకటించిమరీ తెల్లగా తెల్లవారింది. ఆ వార్త వినగానే—

'అరరెరె.... ఎంతపని జరిగిపోయింది?' అని నోట్లో వున్న వేప పుల్ల తుపుక్కున వుమ్మేసి ఊరి పొలిమేరలో వున్న మర్రి చెట్టు దగ్గరకి పరుగెత్తాడు పెద్దకాపు.

అప్పటికే మర్రిచెట్టు కింద జనం బాగా మూగారు. కాని ఒక్కడూ ధైర్యం చేసి శవాన్ని తాకలా. వెర్రినాగన్న వెల్లకిలా పడి వున్నాడు. నోటి నుంచి కారిన నెత్తురు చెక్కిళ్ళ పక్కనుంచి మెడ కిందుగా జాలువారింది. ఛాతీ మీద రక్తం కక్కుకున్న మరకలు వున్నాయి.

'అరె! ఎందుకు అలా కర్రాళ్ళా నిలబడి చూస్తారు? లేపండి శవాన్ని' అని ముందుకొచ్చాడు పెద్దకాపు.

ఒక్కరూ కదల్లేదు.

'నాకు తెల్సు! ఈవూళ్ళో ఆపదొస్తే ఆదుకునేవాడు ఒక్కడూ లెడు. నాకు తప్పుతుందా మరి!!

లాల్చీ చేతులు పైకి లేపి, మడిచి, భుజం మీది కండువాను నడుంకు బిగించికట్టి శవాన్ని సునాయాసంగా లేపి భుజాన్నేసు కున్నాడు పెద్దకాపు.

'అబ్బ! ఎంతకైనా సమర్థుడు పెద్దకాపు' అనుకున్నారు కొంతమంది.

శవాన్ని భుజాన్న వేసుకుని రెండడుగులు వేశాడో లేదో, పోలీస్ ఇనస్పెక్టర్ ఎదురయ్యాడు బలగంతో.

'పోస్టుమార్టం జరగాలి. అంతవరకూ దహనం జరగటానికి వీల్లేదు' అన్నాడు ఇన్‌స్పెక్టర్.

'ఎందుకని?'

'ఇది హత్య.'

పెద్దకాపు పెద్దగా నవ్వాడు. నవ్వుతున్నప్పుడు భుజంమీది నాగన్న చేతులు 'అగు, అగు' అన్నట్లు వూగేయి.

'హత్యా? మా కుటుంబంలోని మనిషిని మర్డరు చెయ్యడానికి ఎన్నివేల గుండె లుండాలి?'

'మరెలా పోయాడంటారు?'

'అసలు ఇంత పొద్దున్నే మీకెలా తెలిసిందో చెప్పండి.'

'తెల్లవారుజామున ఎవరో స్టేషన్‌కు ఫోన్ చేశారట రాకాసి మర్రిక్రింద హత్య జరిగిందని.'

'అవునా మరి! రాకాసి మర్రి అని దానికాపేరు ఎలా ఒచ్చిందంటారు? ఇది మామూలుగా మనుషులు చేసిన హత్య కాదండీ. దాని పనే. ఆ చెట్టుమీద బ్రహ్మరాక్షసి వుంది చూశారూ అప్పుడప్పుడు అలా బలి తీసుకుంటూ వుంటుంది.'

'అలాగని మీరూ నేనూ నమ్మినా చట్టం నమ్మదండీ.'

'దీని సిగ్గోసిరి. చట్టానిదేముందండీ!! అది మనం చేసుకున్నదేగా?'

'అందుకే ముందు శవపరీక్ష జరగనివ్వండి'

క్షణం ఆలోచించాడు పెద్దకాపు.

'సరే! అలాగే కానివ్వండి. కాని ఒక్కమనవి. శవ పరీక్షవల్ల శవం పోలిక లేకుండా పోతుంది మరి! దానికి ముందే ఊళ్ళో ఆడాళ్ళనీ బంధువుల్నీ కాస్త చూసుకోనివ్వండి.'

'ఈయనకి దగ్గర బంధువులు ఎవరైనా వున్నారా?'

'బాగుంది ఇనస్పెక్టరుగారూ మీ వరస! రామాయణం అంతా విని 'రాముడికి సీత ఏమౌతుంది' అనడిగాడట వెనకటికి ఓ మహానుభావుడు. ఇతనికి నాకంటె దగ్గర బంధువు ఎవరండీ? ఇతనికి స్వయానా తమ్ముడు నా అల్లుడు.

'మీ అల్లుడుగారు ఊళ్ళోనే వున్నారా ?'

'ఉహుఁ.... లేదు. పాపం ఇతనికి పెళ్ళికూడా నిశ్చయమైందండీ. కబుర్లకని ఊరెళ్ళాడు.'

'ఇతనికి ఇంతవరకూ పెళ్ళెందుకు కాలేదో మీకు తెల్సా ?'

'నాకేఁటండీ, ఊరందరికీ తెల్సిందే. వీడో వెఱ్ఱిబాగులవాడు. ఎవ్వరూ పిల్లనివ్వక ఇంతవరకూ పెళ్ళి కాలేదు. ఇప్పుడెలాగో పెళ్ళి కుదిరిందని సంతోషిస్తూవుంటే, యీ ఘోరం జరిగిపోయింది.'

'అమ్మాయిది ఏవూ....

'అయ్యా! ఇనస్పెక్టర్‌గారూ శవం నా భుజాన్న వుంది. మీరేమో నిలబడే వున్నారు.'

'అయాం సారీ. సరే ఇంటికే పదండి'.

ఇంటికి వెళ్ళేకమరి శవపరీక్ష మాట ఎత్తలేదు ఇనస్పెక్టర్.

* * *

వెర్రి నాగన్న యీ లోకం విడిచిన నెల రోజులకి మళ్ళీ పెద్ద కాపును కల్సుకున్నాడు పానకాలు.

'పిల్లలు కూడులేక సచ్చిపోతన్నారు బాబయ్యా.'

'ఒరేయ్ పానకాలూ, నాకు తెలీక అడుగుతాను, ఇంతవిశాలమైన భూఁవి వుండగా అంత భూఁవీ యేడాదికి రెండు పంటలు పండుతుంది గదా ? ఇంకా తిండిలేక ప్రజలు ఎందుకు బాధ పడుతున్నారంటావ్ ? ఎంత తల బద్దలు కొట్టుకున్నా ఇది మాత్రం నాకు అర్థంకాదురా'.

'తఁవరు సెప్పినట్టూ.....'

'ఊ.... అదే'

'అది కాదండి...'

'మరేవిటంటావ్ ?'

'అదేనండీ. పనై పోతే రెండెకరాలు రాసిత్తానన్నారు. పనయి నెల దాటిపోతుంది'.

'పనేఁవిటి ? పోలం ఏఁవిటి ?'

'అంతేనంటారా ?'

'మరింకేఁవిటి ?'

'సాల్లే బాబో ఇంకేం సెప్పకు...' అంటూ వెనక్కి తిరిగి పరుగిచ్చుకున్నాడు. ఆ పరుగు పరుగు పెద్దిసెట్టి సారాకొట్టు దగ్గిరగాని ఆగలేదు.

'సెట్టిగారో.... ఓ గలాసు పరుకెయ్యి బావ్ మొత్తం ఒకే సెల్లు గట్టెత్తా.'

'ఏసెల్లెహె ! అది నువు రోజూ అనే మాటేగా'.

'నేదు బావ్ ! నిజంగానే...'

'ఓవ్ తాగరా తాగుబోతునాయాల...నువ్వు ఇత్తావనే వొత్తన్నా నేంటి ? తాగి బట్టిదగ్గర కూకోని మంచెట్టు'

పీకదాకాతాగి వాగుడు మొదలెట్టాడు నూకాలు. అందులో రాకాసి మరిర్రి రహస్యాలన్నీ వున్నాయి. అవి పెద్దిసెట్టి పాకలోంచి పాకిపాకి పెద్దకాపు అల్లుడుదాకా వచ్చాయి. ఆమాటే అన్నాడు మామగారి తోటి.

'ఓ.... అలాగా ? అయితే చంపింది బర్రిహ్మరాక్షసి కాదన్న మాట !' అన్నాడు పెద్దకాపు ఆశ్చర్యంగా.

'నేను పానకాలిగాడిమీద కేసు పెడతాను'.

'మంచిదే.... దానికేం... మరారాజులా పెట్టచ్చు, బోలెడన్ని సాక్ష్యాలుకూడా సేకరించవచ్చు. కాని, వాడు పిచ్చోడు. పిచ్చోణ్ని చట్టం శిక్షించదు.'

'చట్టం చావేదో చట్టాన్నే చావనివ్వండి. ఇదంతా విన్నాక నేవింక ఊరుకోలేను.'

'అలాగే! రేపే ప్లీడర్‌గారితో మాట్లాడుదాం.'

కాని—

ఆ రేపటికి పానకాలు బతికిలేడు.

ం ం ం

'ఈ రాకాసిమర్రి రహస్యం నాకు తెల్సు' అంది సీతమ్మ. అనంతనాయుడు భార్య. గత పంచాయితీ ఎన్నికల్లో ఈ అనంత నాయుణ్నే బ్రహ్మరాక్షసి బలి తీసుకుంది. ఎన్నికల్లో అనంతనాయుడూ నెగ్గేడు. పెద్ద కాపూ నెగ్గేడు. అయితే మెజారిటీ అనంతనాయుడివైపు మొగ్గి ప్రెసిడెంటు అయిపోతాడు అనుకుంటున్న తరుణంలోనే యీ ఘోరం జరిగిపోయింది.

'అయితే మా అన్నగార్ని ఎవరు చంపారంటారు' అనడిగాడు పెద్దకాపు అల్లుడు అమాయకంగా.

సీతమ్మ వులకలేదు పలకలేదు. చేతి సంచిలోంచి టేపు రికార్డరు తీసి బటన్ నొక్కింది.

'—మన యెర్రోడు లేడూ, అదేరా మా అల్లుడి అన్నగారు. అసలే బూదేవి తొమ్మిదిమాసాల గర్భిణీలాగ జనంతోట అపసోపాలు పడతావుంటే, ఈ యెదవకి ఇన్నాళ్ళకి పెళ్ళాడాలని బుద్ధిపుట్టింది.'

'పెళ్ళి సెడగొట్టెయ్యాలాండి'

'ఎడిశావ్ లేవోయ్! ఆ మాత్రం పని నేన్జెయ్యలేనేంటి.'

'మరేం చెయ్యాలంట ?'

'ఏం లేదు చిన్నపనే... చాలా చిన్నపని. అడికి ఈ మధ్య రెండో ఆట సిన్మాలు మా జోరయినాయి. మంచిరోజు చూసి మర్రిచెట్టు కింద తొంగోబెట్టెయి....'

ఠక్కున బటను నొక్కింటి సీతమ్మ.

అతని మనస్సంతా శూన్యమైపోయింటి. మతిలేనివాళ్ళా అలాగే వుండిపోయాడు. అక్కడ్నించి బయలుదేరాడు. నిఖార్సయిన నిలువెత్తు బ్రహ్మరాక్షసి అతని కళ్ళముందు ప్రత్యక్షమయ్యాక గాని అతనీ లోకంలోకి రాలేదు.

'మా అన్నని నువ్వే చంపావు' అన్నాడు ఆవేశంగా.

'ఏమిటీ ? ఎలక్షన్ల ప్రచారం సీతమ్మగారు ఇలా మొదలెట్టారేంటి ?'

'ప్రచారంకాదు. పచ్చి నిజం'

'పోనీ నిజమే అనుకో....అయినా ఎవరి కోసం చేశానంటావ్ ?'

'నా కోసమా ?'

'మరి ? అంతమంది ఆడపిల్లల్ని ఎవడు కనమన్నాడు.'

'అయితే మీరే చంపారా ?'

'లేదు ఇదంతా మాటవరసకి చెప్పాను.'

'కాదు నిజమే !'

'ఎలాగ ?'

'మీ మాటలన్నీ టేపుమీద రికార్డయి వున్నాయి'

ఆలోచించాడు పెద్దకాపు.

'ఒరేయ్ ! పద్దిగా....' అంటూ సింహ గర్జనచేసి బయటికి వురికాడు పెద్దకాపు.

ఇది జరిగి సంవత్సరం అయినా కాలేదు. ఓరోజు తెల్లవారే ప్పటికి ఆ వూరి పంచాయతీ ప్రశిడెంటు సీతమ్మగారితో సహా ఇంటిల్లపాదీ పీకలు తెగి పడివున్నారు. ఊళ్ళోకి ఎర్రటోపీలూ - కంచు టోపీలూ దిగేసమయానికే-

అక్కడ-

కాకినాడ జనరల్ హాస్పిటల్లో కంటి ఆపరేషన్‌కోసం పెద్ద కాపును సిద్ధం చేస్తున్నారు.

★